క్లుప్తంగా

లంక సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



నాగాయలంక: సంకట హర చవితి(చతుర్థి) పర్వదినం పురస్కరించుకుని గ్రామంలోని పురాతనమైన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే అభిషేకాలు, పూజలు జరిపి విశేష అలంకారం చేశారు. అలాగే మండలంలోని భావదేవరపల్లి శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో వినాయకస్వామి వారికి అభిషేకాలు చేశారు. విఘ్నేశ్వరుడిని గరిక గడ్డితో అలంకరించారు. వ్యవస్థాపక ధర్మకర్తలు పూషడపు నిరంజనరావు, శివసత్యవతి, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిట్టి పిళ్లారయ్య ఉత్సవాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని బుట్టాయిపేటలో వేంచేసి ఉన్న శ్రీ వల్లభాంబా సమేత మహాగణపతి పంచాయతన క్షేత్రం(శ్రీ చిట్టి పిళ్లారయ్య) ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆచార్య వందనం, గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవాచనం వంటి పూజా కార్యక్రమాల అనంతరం ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ శత చండీ యాగ సంకల్పం, శ్రీ మహారుద్ర యాగ సంకల్పం, మంటపారాధనలు, యాగశాల విహారం, అంకురారోపణ నిర్వహించారు. శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ఆంజనేయస్వామికి ఆదిత్యాది నవగ్రహాలకు అభిషేకాలు, అర్చన, నవగ్రహ యజ్ఞం, మన్యు సూక్త మహా మృత్యుంజయ హోమాలు జరిగాయి. మధ్యాహ్నం పూర్ణాహుతి చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే నివారణ సాధ్యమే

కేయూ వీసీ ఆచార్య రాంజీ

కోనేరుసెంటర్: క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే నివారణ సాధ్యమేనని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కే రాంజీ పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మణిపాల్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన క్యాన్సర్‌పై అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న విప్లవాత్మక మార్పుల వల్ల క్యాన్సర్‌ను నయం చేయవచ్చని తెలిపారు. రెక్టర్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సల్లో రోజురోజుకు అనేక కొత్త విధానాలు వస్తున్నాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష మాట్లాడుతూ క్యాన్సర్ విషయంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మణిపాల్ ఆసుపత్రి క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ దినేష్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా క్యాన్సర్ కారకాలు, నివారణోపాయాలను వివరించారు. అనంతరం ఆయనను వీసీ సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సమన్వయకర్త డా. ఎం శ్రావణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. శేషారెడ్డి, డా. స్వరూప, డా. రవి, డా. శాంతికృప, సీహెచ్ గోపి, సహాయ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

చల్లపల్లి: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. చల్లపల్లి మండలం పురిటిగడ్డ గ్రామంలో వ్యాపారం చేస్తున్న మత్తి లీలాసతీష్ అనే వ్యక్తి తన దుకాణంలోనే పని చేస్తున్న అదే గ్రామానికి చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు అత్యాచారం చేశాడని యువతి చేసిన ఫిర్యాదు మేరకు చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయిన సంగతి తెలిసిందే. చల్లపల్లి సీఐ కే ఈశ్వరరావు నిందితున్ని అరెస్టు చేసి మొవ్వ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండు విధించినట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడి షాపు తొలగింపు



శ్రీకాకుళం(ఘంటసాల): అధికారులు కూటమి నేతలుగా మారి శ్రీకాకుళం కరకట్టపై ఉన్న వైఎస్సార్ సీపీ సానుభూతిపరుని షాపును మంగళవారం తొలగించారు. బాధితుల వివరాల మేరకు.. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామానికి చెందిన రావూరి శ్రీనివాసరావు (వాసు) శ్రీకాకుళం కరకట్టపై అందరితోపాటు షాపు ఏర్పాటు చేసుకున్నాడు. కరకట్టపై ఆక్రమణల తొలగింపు పేరుతో ఇరిగేషన్ అధికారులు బాధితులకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా జేసీబీ తీసుకొచ్చి ఎవరూ లేని సమయంలో షాపును తొలగించే పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న బాధితుల కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని షాపులో రూ.1.50 లక్షల విలువైన సామగ్రి ఉందని తీసుకోవడానికి అవకాశం ఇవ్వాలని వేడుకున్న కనికరించకుండా జనసేన నేత కనుసన్నల్లో అధికారులు షాపు తొలగించారని తెలిపారు. కరకట్టకు ఇరువైపు ఉన్న సుమారు 150 షాపులను కూడా అధికారులు తొలగించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

చీకట్లో మండల వ్యవసాయశాఖ కార్యాలయం

- ఏఓ కార్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేత
- లైటు వెలగదు.. కంప్యూటర్ ఆన్ అవదు



పెడన వ్యవసాయశాఖ ఏఓ కార్యాలయం

పెడన: గది చీకటిగా ఉంది లైటు వేద్దామంటే వెలగదు. అసలే వేసవి కాలం ఉక్క పోస్తుంది.. ఫ్యాన్ వేసుకుందామని చూస్తే తిరగడం లేదు.. పోని ఎలాగోలా మన పని చేసుకుందామంటే కంప్యూటర్ ఆన్ కాని దుస్థితి.. ఇదీ మండల ఏఓ కార్యాయలంలో సిబ్బంది పరిస్థితి. లైటు వెలగకపోవడం, ఫ్యాన్ తిరగకపోవడం, కంప్యూటర్ ఆన్ కాకపోవడానికి కారణం విద్యుత్ సరఫరా లేకపోవడమే. అదేమిటి నిన్న.. మొన్నటి వరకు విద్యుత్ సరఫరా బాగానే ఉందిగా ఇప్పుడేమైందనే ప్రశ్న ఇటు విధులకు హాజరయ్యే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లుకు, ఎంపీఈవోలకు ఉత్పన్నమవుతుంది. గత కొన్ని నెలలు నుంచి విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. విద్యుత్ సిబ్బంది వస్తున్నా ఏఓ కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో వారికి ఏం చేయాలో తెలియక విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అయినా వ్యవసాయశాఖలో చలనం రాలేదు. వారం రోజులుగా విద్యుత్ సరఫరా నిలిపివేసినా ఎవరి పనులు వారు చేసుకుంటూ పోతున్నారు.

రెగ్యులర్ ఏఓ లేరు

రెగ్యులర్ ఏఓ సస్పెండ్ కావడంతో మచిలీపట్నం అగ్రిల్యాబ్‌లో విధులు నిర్వహించే నూరున్నీసాకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించి ఏడాది కావస్తోంది. ఈమె మచిలీపట్నంలోనే విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పెడనలోని వ్యవసాయశాఖ అధికారి కార్యాలయం తలుపులు అప్పుడప్పుడు మాత్రమే తెరుచుకుంటాయనే ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహించే గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ)లు ఒక రోజు మండల కేంద్రమైన ఏఓ కార్యాలయంలో విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడమే కాకుండా ఏ రోజు ఎవరు విధులు నిర్వహించాలనే దానిపై స్పష్టత ఇచ్చారు. ఈ నేపథ్యంలో మండలంలో ముమ్మరంగా ఈకేవైసీలు, ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలు వేగవంతంగా చేస్తున్నారు. వీరు తమ గ్రామ సచివాలయాలను వదిలి మండల కేంద్రాలకు వస్తే వెనుకబడిపోతున్నారు. దీంతో మండల కేంద్రానికి అయిష్టంగానే వెళుతున్నారనే విమర్శలున్నాయి. కాగా వారం రోజులు పాటు ఏఓ కార్యాలయం తాళాలు కనిపించకపోవడంతో పక్కనే ఉన్న ఆర్బీకేలో సిబ్బంది విధులు నిర్వహించారు. ఆ తర్వాత తాళాలను పగులగొట్టి తెరిచి ఏఓ కార్యాలయంలో విధులకు హాజరవుతున్నారు. ఈ పరిస్థితులకు తాజాగా విద్యుత్ సరఫరా కూడా నిలిపివేశారు. దీంతో వీఏఏలు తమ పని ముందుకు సాగడం లేదని, కనీసం కంప్యూటర్‌లో పేర్లు నమోదు చేసుకుని ఆన్‌లైన్ చేద్దామన్నా విద్యుత్ సరఫరా లేక ఖాళీగా కూర్చోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

రెండు రోజుల్లో విద్యుత్ సరఫరా



విద్యుత్ సరఫరా నిలుపుదల చేసిన విషయం ఆలస్యంగా తెలిసింది. సుమారు రూ. 70వేలు వరకు చెల్లింపులు చేయాల్సి ఉంది. రెండు, మూడు రోజుల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని విద్యుత్‌శాఖ వారు తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా నాతోపాటు సిబ్బంది కూడా అందుబాటులోనే ఉంటున్నాం. ఫోన్ చేసిన వారికి సలహాలు, సూచనలు కూడా చేస్తున్నాం.

–నూరున్నీసా, ఇన్‌ఛార్జి ఏఓ, పెడన

కృష్ణ చౌదరికి పేర్ని నాని నివాళి



కష్ణ చౌదరి శవపేటికను మోస్తున్న పేర్ని నాని, లంకా సూరిబాబు

మచిలీపట్నంటౌన్: స్థానిక 42వ డివిజన్ బలరాముని పేటలో అనారోగ్యంతో మృతిచెందిన ఆరోగ్య శాఖ రిటైర్డ్ ఉద్యోగి అరిగెల కృష్ణ చౌదరికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య(నాని) మంగళవారం నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కృష్ణ చౌదరి అంతిమ యాత్రలో శవపేటికను మోశారు. పేర్ని నానితో పాటు మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా కోశాధికారి బందెల థామస్‌నోబుల్, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జక్కుల ఆనంద్‌బాబు(జానీ), పార్టీ నాయకులు నాగేశ్వరరావు, చీలి చక్రపాణి, దళిత జేఏసీ నాయకులు నివాళులర్పించారు. అలాగే బలరామునిపేటలో ఇటీవల మృతిచెందిన పారిశుద్ధ్య కార్మికురాలు కఠారి వెంకటేశ్వరమ్మ, జుజ్జువరపు చిన్నమ్మాయి, 43వ డివిజన్‌లో మృతి చెందిన జల్లూరి గోపి కుటుంబ సభ్యులను పేర్ని నాని పరామర్శించారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గ సభ్యులతో ఆర్యవైశ్య అనుబంధ సంఘాల సభ్యులు

పెడన: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం స్థానిక శ్రీ వాసవి ప్రార్థన మందిరంలో జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తాతా రజినికుమారి, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కృష్ణాజిల్లా చైర్మన్ అన్నం సాయి సునీతలు హాజరయ్యారు. పెడన శాఖ అధ్యక్షురాలిగా కొమ్మూరి విజయదుర్గ, ప్రధాన కార్యదర్శిగా జవాజి మాధవి, కోశాధికారిగా తమ్మన అన్నపూర్ణ, ఉపాధ్యక్షురాలుగా తమ్మన లక్ష్మీతాయారు, అడ్వైజర్‌గా కొల్లూరి మంజులత, పీఆర్ఓగా కొల్లూరి పద్మ, కార్యదర్శులుగా ఆలపాటి ధనలక్ష్మి, మామిడి సావిత్రి ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్యవైశ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం మచిలీపట్నానికి చెందిన క్యాన్సర్ వ్యాధిగ్రస్తుడు యోగేంద్ర కుటుంబానికి వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన వారు రూ. 10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ పేద విద్యార్థులకు విద్యానిధికి రూ.50వేలు చందా ప్రకటించారు. నామినేటెడ్ పదవులు పొందిన కృష్ణాజిల్లా గ్రంథాలయం పెడన శాఖ డైరెక్టర్ వేముల రమేష్, పైడమ్మ తల్లి దేవస్థానం సభ్యురాలు గోకవరపు పద్మావతిలను వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు ప్రతినిధులు, ఆర్యవైశ్య నాయకులు సత్కరించారు.

• అధికారుల కోసం కుర్చీల ఎదురుచూపులు..!

చల్లపల్లి: తమను అధిష్టించే అధికారులు ఎప్పుడు వస్తారా.. అంటూ ఆశగా ఎదురు చూస్తున్న కుర్చీలను చూస్తే జాలి కలుగుతోంది. ఎవరికి వారు తమకు ఇష్టం వచ్చిన రీతిగా సమయపాలనే లేకుండా ఆలస్యంగా ఆఫీసుకు రావడం, సాయంత్రం సమయం పూర్తవకముందే వెళ్లిపోవడం అన్న చందంగా ఉంది చల్లపల్లిలోని కొందరు అధికారుల పనితీరు. మార్గమధ్యంలోనే సంబంధిత గ్రామ స్థాయి కార్యాలయాలకు వెళ్లి ఫొటోలు పెడుతూ తాము ఫీల్డ్‌లో ఉన్నామని అందుకనే ఆలస్యం అయ్యిందనే ఆలోచన కలిగేలా అతి తెలివి ప్రదర్శించడం కొసమెరుపు.



ఉదయం గం.11.16ల వరకూ కానరాని హౌసింగ్‌శాఖ ఏఈ



ఉ.11.07లు అయినా కార్యాలయానికి రాని వెలుగు ప్రాజెక్టు ఏపీఎం



ఉ.11.20లకు డ్రెయినేజీ శాఖ డీఈ కుర్చీ ఇలా..

మహిళల స్వయం ఉపాధితోనే ఆర్థిక వృద్ధి

బందలాయిచెరువు(అవనిగడ్డ): మహిళలు స్వయం ఉపాధితోనే ఆర్థిక స్వావలంబన సాధిస్తారని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి అన్నారు. మండల పరిధిలోని బందలాయిచెరువులో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కేవీకే ఆధ్వర్యంలో మహిళలకు మామిడిలో విలువ ఆధారిత ఉత్పత్తులపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణలో తయారుచేసే విలువ ఆధారిత ఉత్పత్తులను నేర్చుకుని మహిళలు స్వయం ఉపాధి పొందాలని సూచించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జీ కృష్ణవేణి మాట్లాడుతూ మామిడి ఉపయోగాలు, వాటి ద్వారా లభించే పోషకాలను వివరించారు. మామిడి పన్నా, మామిడి చాక్లెట్స్, మామిడి తాండ్ర, మామిడి జ్యూస్ వంటి పదార్థాల తయారీ విధానం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. మామిడి ఉత్పత్తులకు బయట మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, వీటి తయారీకి మహిళలు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ రేవతి, డాక్టర్ యశ్వంత్, మహిళలు పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది కవుల సమ్మేళనం



కవితా సమ్మేళనం నిర్వహిస్తున్న కవులు

అవనిగడ్డ: శ్రీవిశ్వావసు నామ ఉగాదిని పురస్కరించుకుని ఆకాశవాణి ధ్వని ముద్రణ కోసం మంగళవారం ముందస్తు ఉగాది కవుల సమ్మేళనం జరిగింది. విజయవాడ ఆకాశవాణి సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మన టీవీ భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కవి డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్ కవితా గానం చేశారు. ప్రముఖ కవులు, అవధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానందప్రసాద్, పూషడపు సుబ్బారావు, బీ శ్రీసుహితా భారతి, డాక్టర్ డీ ఉమారాణి, గొరుముచ్చు సూర్యనారాయణ, జల్లూరి రమాకుమారి, నాయుడు బసవకామేశ్వరి, సింహాద్రి పద్మ, వంగర శేషగిరిరావు, చెన్నగిరి లతామోహన్, నడకుదిటి రాధాకృష్ణమూర్తి, దీవి ఝాన్సీ, సూరగం రామకృష్ణ ఉగాది కవితలను రాగయుక్తంగా, భావ భరితంగా చదివి వినిపించారు. ఆకాశవాణి సంచాలకులు బీ వెంకటేశ్వర్లు, ప్రయోక్త చుండూరు మాణిక్యాలరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈనెల 30వ తేదీన ఉగాదిని పురస్కరించుకుని విజయవాడ ఆకాశవాణి కేంద్రం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేస్తామని వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో నవజీవన్ విద్యాసంస్థల చైర్మన్ కొండవీటి ఈశ్వరరావు, పలువురు కవులు, సాహితీ అభిమానులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు విద్యార్థినులతో హెచ్‌ఎం, పీడీ

కోడూరు: జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 14 నుంచి 16 వరకు వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందులలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ జట్టులో పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థినులు పేరే మధుప్రియ, దేసు నాంచారమ్మ పాల్గొన్నారు. ఈ పోటీల్లో వీరు ప్రతిభ కనబర్చి తృతీయస్థానంలో నిల్వడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు హెచ్‌ఎం నాగరత్నకుమారి తెలిపారు. ఈ నెల 27 నుంచి 30 వరకు బీహార్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఇరువురు విద్యార్థినులు పాల్గొంటారని చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులతో పాటు శిక్షణ ఇచ్చిన పీడీ బీపీఎల్ ప్రసాద్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

అందుబాటులో ఆర్గానిక్ ఉత్పత్తులు



చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ కూరగాయల స్టాల్

చల్లపల్లి: ఆర్గానిక్ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకంతో పాటు ప్రజలకు వాటిపై అవగాహన కల్పించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వం తరపున ప్రతి సోమవారం ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేస్తున్నట్లు మాస్టర్ ట్రైనర్ బొడ్డు రాంబాబు పేర్కొన్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం సాయంత్రం 3.30 నుంచి 5.30గంటల వరకు చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆర్గానిక్ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకు కూరలను విక్రయిస్తున్నట్లు రాంబాబు తెలిపారు. మోపిదేవి మండల పరిధిలోని కప్తానుపాలెం సమీపంలో పొలం తీసుకుని ఎటువంటి రసాయనిక ఎరువులు, మందులు వాడకుండా పూర్తి గోవు ఆధారిత ఉత్పత్తులతో పంటలను పండిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్నవారికి ఈ రకమైన పంటల ఉత్పత్తులు, గోవు ఆధారిత జీవామృతం తయారీ విధానం వంటి వాటిపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.



మాక్ డ్రిల్‌ను తిలకిస్తున్న ఎండీ కూర్మనాథ్



లంకలో చిక్కుకున్న ప్రజలకు ఆహార పదార్థాల పంపిణీ

• ఆకట్టుకున్న మాక్‌డ్రిల్



వరదలో చిక్కుకున్న వారిని ఒడ్డుకు చేరుస్తున్న దృశ్యం

నాగాయలంక: నాగాయలంక వద్ద కృష్ణాతీరంలో ఏపీ ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ తదితర రెస్క్యూ టీమ్‌లు మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించాయి. విపత్తుల సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ పర్యవేక్షణలో 16 శాఖల అధికారులు, ఉద్యోగుల సమన్వయంతో ఈ మాక్ ఎక్సర్‌సైజ్ అట్టహాసంగా జరిగింది. వరదలు, ఇతర ప్రకృతి విపత్తుల్లో ప్రజలను ఎలా సురక్షితంగా బయటకు తీసుకురావాలనే అంశంపై కళ్లకు కట్టినట్లు డెమో చూపించారు.



గాయపడిన వ్యక్తికి చికిత్స చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు

లంకపల్లి(ఘంటసాల): వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో డీ సుబ్బారావు ఆదేశించారు. ఘంటసాల మండలం లంకపల్లి, దాలిపర్రు, పాపవినాశనం గ్రామాల్లో ఎంపీడీవో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వాటర్ ట్యాంకులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, తడి-పొడి చెత్త సేకరణ పనులను పరిశీలించాలన్నారు. పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు కందుల నాగ నాంచారమ్మ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

నాంచారమ్మ ఆలయ ఆదాయం రూ. 13.96 లక్షలు

కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ప్రధాన జాతరకు సంబంధించి ఆలయానికి రూ. 13.96లక్షల ఆదాయం సమకూరినట్లు దేవదాయ అధికారులు మంగళవారం వెల్లడించారు. ఈ నెల 13, 14 తేదీల్లో అమ్మవారి ప్రధాన గుడి సంబరం జరిగింది. రెండు రోజులకుగాను హుండీ ద్వారా రూ. 6,27,182లు, టికెట్లు, విరాళాలు, పాలపొంగళ్ల ద్వారా రూ. 4,92,118ల ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు. వీటితో పాటు లడ్డూ విక్రయాలకు నిర్వహించిన వేలంపాటలకు రూ. 80వేలు, కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయాలకు రూ. 66వేలు, బియ్యం, కొబ్బరిచిప్పల సేకరణకు నిర్వహించిన వేలం పాటలకు రూ. 1.31లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. లెక్కింపులో దేవదాయ ఇన్‌స్పెక్టర్ ఖగ్గా శ్రీనివాసరావు, ఆలయ అధికారిణి జయశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు బెయిల్ మంజూరు

పెడన: టీడీపీ కార్యకర్తపై దాడి చేశారనే కారణంతో వైఎస్సార్ సీపీకి చెందిన నాయకులు, సానుభూతిపరులైన 11 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఈ నెల 16న మధ్యాహ్నం నుంచి ఆదివారం రాత్రి వరకు జరిగిన సంఘటనలపైన, అరెస్ట్‌లపై 'అక్రమ అరెస్ట్‌ల పర్వం' శీర్షికతో 'సాక్షి'లో మంగళవారం వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఐ ఈ సంఘటనకు సంబంధించి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకుడు, 19వ వార్డు కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్, అతని సోదరులు శిరివెళ్ల వెంకటేశ్వరరావు, శిరివెళ్ల మహేష్, శిరివెళ్ల రాజీవ్‌గాంధీలతో పాటు శిరివెళ్ల శివప్రసాద్, పేరుబోయిన నాగబాబు, తుమ్మ పైడయ్య, పాము నాగరాజు, ఓనం కొండలరావు, ఓనం వెంకట్, పాము సాయిలకు న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారని తెలిపారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్లు కృష్ణాజిల్లా, మచిలీపట్టణం సబ్ - రిజిస్టర్ వారి యిలాకా గూడూరు మండలం, రామన్నపేట, కాపురస్థులు పరసా లేట్ వెంకటాచలం గారి కుమారుడు శ్రీనివాసరావు మరియు వారి కుమారుడు పరసా మురళి గార్లు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా;

నా క్లయింట్లు 1 వ వారు తన స్వార్జితంతో కొనుగోలు చేసి 1 వ వారి రెండవ కుమారుడు అలాగే 2 వారి తమ్ముడు అయిన పరసా వెంకటాచలం పేరున పెట్టినారు, కానీ సదరు ఆస్తి పరసా వెంకటాచలం తన సంపాదనతో కొన్నది కాదని అలాగే సదరు వెంకటాచలం స్కిజోఫోనియా మానసిక రుగ్మత తో బాధపడుతున్నాడు కాన సదరు వెంకటాచలం మానసిక స్థితి ఎప్పుడు ఏ రకంగా ఉంటుందో ఎవ్వరికిని తెలియదు. సదరు మానసిక స్థితి సరిగా లేదని తెలిసిన వారు, వెంకటాచలం పేరున ఉన్న మాగాణి భూమిని అక్రమ మార్గంలో కాజేయవలెను అన్న దురుద్దేశ్యంతో, సదరు వెంకటాచలంతో అగ్రిమెంట్ గాని సేల్ డీడ్‌గాని వ్రాయించుకొని, వెంకటాచలం పేరున తన తండ్రిగారు కొనుగోలు చేసిన ఆస్తిని కాజేయాలి అన్న కపట ఆలోచనలో ఉన్నారు.

కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు పరసా వెంకటాచలంతో ఈ దిగువ ఆస్తికి సంబంధించి కుదుర్చుకొన్న ఒప్పందాలు కానీ కుదుర్చుకోబోయే ఒప్పందాలు కానీ ఇకమిదట చెల్లనేరవు అని నా క్లయింట్లు దృఢిగా ధ్రువపరుస్తున్నారు. సదరు వెంకటాచలం మానసిక స్థితి బాగోలేదు అని ది 20.12.2017 న మచిలీపట్టణం గవర్నమెంట్ హాస్పిటల్ వారు మానసిక వైద్యులకు కూడా రెఫెర్ చేసినారు. సదరు ఆస్తిని కజేయాలి అన్న అన్యులు ఇంతటితో తమ ప్రయత్నం మానుకొనవలసినది లేని యెడల నా క్లయింట్లు సదరు అక్రమ దారులపై క్రిమినల్ మరియు సివిల్ కేసులు కూడా పెడతారు అని ఇందుతో హెచ్చరిస్తున్నారు.

షెడ్యూల్ ఆస్తి : కృష్ణాజిల్లా, చల్లపల్లి సబ్ రిజిస్టర్ వారి యిలాకా, గూడూరు మండలం, రామన్నపేటలోని సర్వే నెంబర్ 101-2 లో య 0.50 సెంట్లు, 56/7సి లో య 0.50 సెంట్లు ,57/2ఎ లో య 0.50 సెంట్లు, 58 /7 లో య 0.47 సెంట్లు, 56/7బి య 0.72 సెంట్లు, మొత్తం పూరా విస్తీర్ణం య 2.69 సెంట్లు మరియు సర్వే నెం 52/5సి లో య 1.06 సెంట్లు, 55 /6 లో య 0.25 సెంట్లు, 57/ 2ఏ లో 0.51 1/2 సెంట్లు, 161/2 లో య 0.95 సెంట్లు, 57/3ఎ య 0.13 సెంట్లు మొత్తం పూరా విస్తీర్ణం య 3.15 సెంట్లు, రెండు కలిపి య 5.84 సెంట్లు మా క్లయింట్లు సర్వ హక్కులతో

కన్నమరెడ్డి శ్రీమన్నారాయణమూర్తి, M.Com. L.L.B.
అడ్వకేట్, మాచవరం మెట్టు, మచిలీపట్నం, సెల్ : 9346312022

సంక్షిప్త వార్తలు

నేటి నుంచి ఆధార్ నమోదు

గూడూరు: ఆరేళ్ల లోపు వయస్సు ఉన్న చిన్నారులకు ఆధార్ కార్డులు జారీ చేసేందుకు బుధవారం నుంచి గూడూరు మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బీ రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాలు 19, 20 తేదీల్లో పోసినవారిపాలెం, 21, 22 తేదీల్లో కప్పలదొడ్డి, 25, 26 తేదీల్లో మల్లవోలు-1, 27, 28 తేదీల్లో ఆకులమన్నాడు గ్రామ సచివాలయాల్లో క్యాంపులు ఉంటాయని వివరించారు.

26న బహిరంగ వేలం

పెడన: పెడన పురపాలక సంఘ పరిధిలో పూలు, పండ్లు, కూరగాయలు, చేపల మార్కెట్, వారపు సంతలో ఆశీలు వసూళ్లకు ఈ నెల 26న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బీ వెంకటరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లీజు ధరావత్తు రూ. 2లక్షలు, సాల్వెన్సీ విలువ రూ.10లక్షలు అని తెలిపారు. 2025 ఏప్రిల్ ఒకటి నుంచి మార్చి 31, 2026 వరకు ఆశీలు వసూళ్లు చేసుకునే అవకాశం కల్పించబడుతుందన్నారు. 26న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో జరిగే ఈ వేలం పాటకు ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని పేర్కొన్నారు.

మట్టి నమూన సేకరణపై అవగాహన

మోపిదేవి: భూ సార పరీక్షలతో సాగు ఖర్చు తగ్గించుకోవచ్చునని ఘంటసాల కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి తెలిపారు. మండల కేంద్రం మోపిదేవిలో బాపట్ల కళాశాల విద్యార్థులు మంగళవారం గ్రామీణ కృషి అనుభవం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ మట్టి నమూన, నీమాస్త్రం తయారీ విధానాన్ని వివరించారు. మట్టి నమూన ప్రాముఖ్యత, లాభాలు, మట్టి నమూన తీసే విధానం, తీసుకోవలసిన జాగ్రత్తలు సూచించారు.

ఈ పంట నమోదుతో మద్దతు ధర

చిలకలపూడి(ఘంటసాల): ఈ పంట నమోదు చేసుకోవడం ద్వారా మినుము, పెసర పంటను మద్దతు ధరకు అమ్ముకునే అవకాశం ఉందని మండల వ్యవసాయశాఖ అధికారి కే మురళీకృష్ణ తెలిపారు. ఘంటసాల మండలం చిలకలపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంటలో నమోదు చేసుకుని ఈకేవైసీ పూర్తి చేసిన రైతుల నుంచి మద్దతు ధరకు మినుము, పెసలు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. వీఏఏలు రైతులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కృత్తివెన్ను: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులతోపాటు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఆయన కోరారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచినట్లు ఆ పాఠశాల డైరెక్టరు కే కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం పోలీసు ఫంక్షన్ ప్లాజాలో ఈ నెల 16వ తేదీన జపాన్ షిటోరియా కరాటే, షుకోకై ఇజుషి ఆంధ్రప్రదేశ్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో విద్యార్థులు పీ యోక్షిత, కేఎల్‌జీఎస్ హర్షిణి, ఎండీ ఫర్హాన్, టీ దీక్షిత్, జీ సిరి కటా విభాగంలో ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచారు. విజేతలను, కోచ్ వెంకటేశ్వరరావును కే కిషోర్ అభినందించారు.